క్లుప్తంగా

విస్తృతంగా వాహనాల తనిఖీ



గుత్తిలో వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి, కాసేపల్లి టోల్ గేట్ వద్ద గుత్తి, పెద్దవడుగూరు పోలీసులు ఆదివారం విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. నంద్యాల జిల్లా ప్యాపిలిలో ఆదివారం ఉదయం ఓ మహిళ మెడలోని బంగారు చైన్‌ను చైన్ స్నాచర్లు ఎత్తుకెళ్లారు. వారు గుత్తి వైపు వెళ్లారన్న ప్యాపిలి పోలీసులు సమాచారంతో గుత్తి, కాసేపల్లి టోల్‌గేట్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో గుత్తి సీఐ వెంకటరామిరెడ్డి, ఏఎస్ఐ నాగమాణిక్యం, పెద్దవడుగూరు ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల మీట్

యాడికి: మండల పరిషత్‌లో కార్యాలయంలో ఎంపీపీ బొంబాయి ఉమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నాటుసారా విక్రేత అరెస్టు



నాటుసారా స్వాధీనం చేసుకున్న సెబ్ పోలీసులు

గుత్తి: స్థానిక సెబ్ పోలీసు స్టేషన్ పరిధిలోని యాడికి మండలం దైవాలమడుగు గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న రమాదేవి అనే మహిళను ఆదివారం గుత్తి సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. సెబ్ సీఐ వరలక్ష్మి నేతృత్వంలో సెబ్ ఎస్ఐ అలీ, హెడ్ కానిస్టేబుళ్లు రియాజ్, రామాంజనేయులు, రామకృష్ణ, మల్లికార్జున, రమేష్ తదితరులు దైవాల మడుగు గ్రామంలో దాడులు నిర్వహించారు. నాటుసారా విక్రయిస్తున్న రమాదేవిని అరెస్టు చేసి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై సెబ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నేత్రపర్వం.. కళా ఉత్సవం



కళాకారుల ప్రదర్శన

అనంతపురం కల్చరల్: నగరంలో నాగిని కళా ఉత్సవాల నగరోత్సవం నేత్రపర్వంగా జరిగింది. కరణం నాగిని వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వందలాది మంది కళాకారుల కళా విన్యాసాల నడుమ నాగేంద్రుడు అడుగడుగునా భక్తి నీరాజనాలు అందుకున్నాడు. స్థానిక మొదటి రోడ్డు కాశీ విశ్వేశ్వర ఆలయం ప్రాంగణంలో ఉత్సవ వేడుకలను ఆలయ ఈవో రమేష్‌బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, నిర్వాహకులు కరణం వెంకటప్రసాద్ ప్రారంభించారు. ఆద్యంతం నగర వీధుల్లో కోలాటం, గురవయ్యలు, కీలుబొమ్మల కళాకారులు, చెక్కభజన తదితర కళారూపాలు కోలాహలంగా నిర్వహించారు.

సంతల ఆదాయం రూ.3.37 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.37 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఫయాజ్, సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1,46,460 వసూలు కాగా, ఆదివారం జరిగిన పశువుల సంత ద్వారా రూ.1,57,260 మేర వసూలైందని తెలిపారు.

కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని ఎంపీయుపీ పాఠశాలలో ఆదివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి గూడూరు సూర్యనారాయణ రెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా దాదాపు 100 మంది రోగులను పరీక్షించిన వైద్యులు 60 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు నంద్యాల శాంతిరామ్ ఆసుపత్రి డాక్టర్ ఆది, క్యాంపు నిర్వాహకులు ప్రకాష్ తెలిపారు. ప్రస్తుతం 40 మందిని నంద్యాలకు తీసుకెళతామన్నారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అనంతపురం పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2024 ఎన్నికలే లక్ష్యంగా పని చేద్దాం

- ఆలూరు సాంబశివారెడ్డి, పైలా నరసింహయ్య

శింగనమల: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావాలని, వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేద్దామని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం బుక్కరాయసముద్రం మండలం ఎస్ఆర్ఐటీలో నియోజకవర్గ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ,వార్డు సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటే ప్రభుత్వ సేవలతోపాటు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గ్రామాల్లో ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీలు, పాలశీతలీకరణ కేంద్రాలు, వ్యవసాయ గిడ్డంగులు నిర్మించడం ద్వారా రైతులు, ప్రజలకు సేవలను అందుబాటులోకి తెచ్చారన్నారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారన్నారు. గ్రామాలకు సైతం తారురోడ్లు నిర్మిస్తున్నారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కింద పంచాయతీల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నారని గుర్తు చేశారు. వీటితోపాటు అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన, మహిళలకు సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలను అందిస్తున్నారన్నారు. కుల, మత, పార్టీలకతీతంగా అర్హులకు సంక్షేమ ఫలాలు అందుతున్నా పక్షాలు, ఎల్లో మీడియా ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. టీడీపీ హయాంలో నిరుపేదలకు ఒక్క సంక్షేమ పథకం అందలేదని, కేవలం ఆ పార్టీ కార్యకర్తలు, జన్మభూమి కమిటీ సభ్యులకు మాత్రమే దక్కాయన్నారు. జగనన్న ప్రభుత్వంలో నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందుకొని అభివృద్ధి చెందుతున్నారన్నారు. నాలుగేళ్లలో ప్రతి ఇంటికీ రూ.1 లక్ష నుంచి రూ. 5లక్ష వరకు లబ్ధి పొందారన్నారు. వీటిని ప్రజల్లోకి విస్తృతం తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందమన్నారు. నియోజకవర్గంలోని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు దాదాపు 4,800 మంది దాకా ఉన్నారని, వారికీ ఉచిత బీమా సౌకర్యాన్ని పార్టీ కల్పిస్తోందని తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.



హాజరైన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు, సచివాలయ, జేసీఎస్ కన్వీనర్లు



మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి, చిత్రంలో పైలా నరసింహయ్య

మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

యాడికి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ దే విజయమని, ఇందుకోసం వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఏకం కావాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారం చేపట్టిన నాలుగున్నరేళ్ల తర్వాత కూడా గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో ఇంటింటికీ వెళ్లగలుగుతున్నామన్నారు. ఇలా చరిత్రలో ఏ పార్టీ చేయలేదని, ప్రతి ఇంటికీ లబ్ధి చేకూర్చామన్నారు. లబ్ధి చేకూరిన ప్రతి ఇంటిలో వైఎస్సార్ సీపీకి పని చేసే ఒక సైనికుడు ఉండేలా చూడాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీని విజయపథంలో నడిపించాలన్నారు.

నాయకుల్లో భరోసా

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గ్రామాల వారీగా సమీక్ష జరపడంతో మండల స్థాయి నాయకులు, ద్వితీయ శ్రేణి నాయకుల్లో భరోసా వచ్చింది. కొంత మంది చిన్నచిన్న సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తేగా వాటిని పరిష్కరిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. నాయకులు ఒకే వేదికపై చేరి వివిధ అంశాలపై చర్చించడంతో అందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి యాడికి మండలంలో పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఇప్పటికే నియోజక వర్గంలోని పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, తాడిపత్రి మండలాల్లో చేపట్టిన పాదయాత్రకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారని, ఆయా మండలాల కంటే రెట్టింపుగా యాడికి మండలంలోని 37 గ్రామాల నుంచి నాయకులు జనాలు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకుడు బాలా రమేష్ బాబు, సీజేఎస్ మండల కన్వీనర్ శివప్రసాద్, నాయకులు కొట్టే వెంకటరామిరెడ్డి, నాగేష్, వెంకటరామిరెడ్డి, శివకేశవరెడ్డి, కృష్ణారెడ్డి, శివరామిరెడ్డి, మల్లికార్జున, కోనా జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రజాసంక్షేమయాత్ర

ఈనెల 22న ఉదయం 7 గంటలకు నాలుగో విడత ప్రజా సంక్షేమయాత్రను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభించనున్నారు. గుడిపాడు నుంచి ప్రారంభం కానున్న పాదయాత్ర కుందన కోట మీదుగా చింతలాయపల్లెకు చేరుకుంటుంది. రాత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అక్కడే బస చేస్తారు. 23న ఉదయం చింతలాయపల్లె నుంచి బోయరెడ్డి పల్లె, చిక్కేపల్లి మీదుగా నిట్టూరు వరకు సాగుతుంది. 24న నిట్టూరు నుంచి తిరునాంపల్లె, తిప్పారెడ్డి పల్లె, కొట్టాలపల్లె వరకు, 25న కొట్టాల పల్లె నుంచి వేములపాడు, క్రాస్, వేములపాడు, మీదుగా నగరూరు వరకు పాదయాత్ర చేపడతారు. 26న నగరూరు నుంచి భోగాల కట్ట, తూట్రాళ్ల పల్లె, రామరాజు పల్లె, కుర్మాజిపేట మీదుగా రాయలచెరువు వరకు, 27న రాయలచెరువు నుంచి చందన మీదుగా పెద్దపేట వరకు, 28న పెద్దపేట నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర యాడికిలో బహిరంగ సభతో ముగియనుంది.



వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

హనుమాన్ దర్శన్ కోసం ప్రత్యేక బస్సులు

గుంతకల్లుటౌన్: శ్రావణమాసం మంగళ, శనివారాల్లో కసాపురం, నేమకల్లు, మురడి ఆంజనేయ స్వామి ఆలయాల సందర్శన కోసం గుంతకల్లు ఆర్టీసీ డిపో ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డీఎం నారాయణస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. హనుమాన్ దర్శనానికి వెళ్లే పెద్దలకు రూ.430, పిల్లలకు రూ.230 చొప్పున వసూలు చేస్తామని పేర్కొన్నారు. అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

నేడు 'స్పందన'

గుత్తి రూరల్:తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మహబూబ్‌బాషా ఆదివారం తెలిపారు. అర్జీలు ఇచ్చే వారు తప్పకుండా ఆధార్, సెల్ ఫోన్ నంబర్ వేయాలన్నారు. మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలని తహసీల్దార్ సూచించారు.

పెద్దవంకలో పూడిక తొలగింపు



పెద్దవంకలో పూడిక తొలగిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని పెద్దవంకలో ఆదివారం పంచాయతీ సిబ్బంది పూడిక తొలగింపు పనులు చేపట్టారు. గ్రామంలో కొందరు వ్యక్తులు ఇంటిలో వృథాగా ఉన్న దుస్తులు, వస్తువులను స్థానిక పెద్దవంకలో వేయడంతో మురుగునీరు ముందుకు సాగకుండా దుర్వాసన వెదజల్లుతోంది. స్పందించిన సర్పంచ్ వరలక్ష్మీ జేసీబీ సాయంతో పెద్దవంకలో పేరుకపోయిన చెత్తను తొలగింపజేశారు. లక్ష్మంపల్లి రోడ్డు కాలువలో పూడిక తీశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన షబ్బీర్

పెద్దవడుగూరు: గుత్తిఅనంతపురం సమీపంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వివరాల మేరకు.. నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన షబ్బీర్, కేశవ్‌గౌడ్ ఆదివారం కారులో అనంతపురం బయలుదేరారు. గుత్తిఅనంతపురం సమీపంలో ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చిన లారీ కారును ఢీకొంది. ఘటనలో కారులో ఉన్న ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. వారిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

వార్డు ఉపఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ హవా

తాడిపత్రి: నియోజకవర్గంలోని తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో 6 వార్డు స్థానాలు, 1 సర్పంచు స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల హవా కొనసాగింది. సర్పంచు స్థానంతోపాటు ఐదు వార్డు స్థానాలను కైవసం చేసుకున్నారు.

- తాడిపత్రి మండలం దిగువపల్లి 9వ వార్డు స్థానానికి వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు ఎద్దుల రామచంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- పెద్దపప్పూరు మండలం దేవునిఉప్పలపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాన్ని వైఎస్సార్సీపీ మద్దతుదారుడు తలారి కాటమయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిన్న ఎక్కలూరు పంచాయతీ 8 వ వార్డు స్థానానికి వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు సత్యనారాయణరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- పెద్దవడుగూరు మండలం జి. వెంకటాంపల్లి 4 వ వార్డు మెంబర్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారురాలు కొదమల లక్ష్మీదేవి 16 ఓట్లతో విజయం సాధించారు.
- యాడికి మండలంలోని నగరూరు గ్రామ పంచాయతీలో 1 వ వార్డు సభ్యుడిగా వెన్నపూస విజయ్‌కుమార్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యాడికిలోని 19 వ వార్డు సభ్యుడిగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు మేకల శ్రీరాములు 73 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గార్లదిన్నె: మర్తాడులో సోమవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రశాంతంగా ఉచిత కోచింగ్ ప్రవేశ పరీక్ష

అనంతపురం రూరల్ : ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సివిల్ సర్వీసెస్, గ్రూప్–1, గ్రూప్–2 పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్ రావు తెలిపారు. జిల్లాలో ఆర్ట్స్ కళాశాల, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల, కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాల్లో పరీక్ష నిర్వహించామన్నారు. పరీక్షకు 1,676 మంది దరఖాస్తు చేసుకోగా, 1,055 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. మిగిలిన 612 మంది గైర్హాజరయ్యారని జేడీ తెలిపారు. బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి అన్నదొరై, అనంతపురం సంక్షేమ సహాయ అధికారి దామోదర్ రెడ్డి పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు



అశ్వత్థక్షేత్రంలో నాగదేవతలకు పూజలు చేస్తున్న మహిళలు



తాడిపత్రిలో పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు



గార్లదిన్నెలో పుట్టకు పూజలు చేసిన మహిళలు

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఆదివారం నాగులచవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తాదులు నాగదేవతల ఆలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో పుట్టల వద్ద పాలు పోసి దీపాలు వెలిగించి నాగేంద్రుడికి పూజలు చేశారు. పట్టణంలోని కసాపురం రోడ్, ఎల్లమ్మతగ్గు, హనుమేష్‌నగర్‌లోని కళ్యాణమండపం, పాండురంగస్వామి ఆలయం, మిల్లు ఏరియా, రాజేంద్రనగర్ ప్రాంతాల్లోని పుట్టల వద్ద భక్తుల రద్దీ నెలకొంది.

పెద్దపప్పూరు: నాగుల చవితి సందర్భంగా ఆదివారం మండలవ్యాప్తంగా అన్నిగ్రామాల్లో మహిళలు ఉపవాసాలతో నాగదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో వెలసిన సుబ్రమణ్యస్వామికి సర్పదోషం ఉన్నవారు తైలాభిషేకం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని కొండమీద హనుమంతురాయుడికి దర్శనం కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఏటా కొండపైకి వెళ్లి స్వామివారికి పిండివంటలను నైవేద్యంగా సమర్పించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది.

పెద్దవడుగూరు: మండలంలోని మహిళలు ఆదివారం నాగులచవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, మహిళలు పెద్దఎత్తున పుట్టల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి నాగదేవతకు నూతన వస్త్రాలు అలంకరించారు. పుట్టలోకి పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు.

యాడికి: మండల వ్యాప్తంగా ఆదివారం నాగుల చవితి పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఉదయమే తలంటు స్నానం చేసి తమ పిల్లలతో కలిసి గ్రామ సమీపంలో గల పుట్ట వద్దకు పోయి , పుట్టలో పాలు పోశారు. పుట్ట వద్ద చీరలు, నువ్వుల పిండి, పిండి పదార్థాలను పుట్ట వద్ద ఉంచి మొక్కులు తీర్చుకున్నారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా ఆదివారం నాగులచవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లోని నాగులకట్టలతో పాటు పుట్టల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా ఆదివారం నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో పుట్టలు, నాగులకట్ట వద్ద మహిళలు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

యల్లనూరు: మండలవ్యాప్తంగా పుట్టలకు నాగుల చవితి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పుట్టల వద్ద పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

తాడిపత్రి : పట్టణంలో నాగుల చవితి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నువ్వుల ఉండలు, పిండి వలటలను పుట్టల వద్ద ఉంచి పూజలు చేశారు. గన్నెవారిపల్లె కాలనీలోని రామాలయం వద్ద ఉన్న నాగులకట్ట, విశాల్ మార్ట్ సమీపంలో ఉన్న పుట్ట వద్ద వద్ద భక్తుల సందడి నెలకొంది.

జగనన్న పాలనలో నెరవేరిన సొంతింటి కల

- ఆలూరి సాంబశివారెడ్డి, పైలా నరసింహయ్య

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల సొంతింటి కల నెరవేరిందని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జగనన్న హౌసింగ్ కాలనీలో గృహ ప్రవేశాల కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న గృహ నిర్మాణ పథకం కింద ఇంటి పట్టా మంజూరుతో పాటు ఇళ్లను మంజూరు చేశారన్నారు. పేదల ఇంటి నిర్మాణానికి మహిళా సంఘాల ద్వారా రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకూ రుణాలు మంజూరు చేస్తోందన్నారు. అందరికీ ఇళ్లు పథకం కింద గ్రామాలనే నిర్మించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో పేదలు సొంత ఇళ్లు కావాలంటే టీడీపీ నాయకుల సిఫార్సు తప్పనిసరిగా ఉండేదన్నారు. అయితే ప్రస్తుతం ఎవరి ప్రమేయం లేకుండా పేదలకు ఇళ్ల పట్టాతో పాటు ఇంటిని మంజూరు చేస్తున్నారని తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని సంక్షేమ పథకాలు చేపట్టేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, వైఎస్సార్ సీపీ గార్లదిన్నె మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, నాయకులు బుల్లే నారాయణస్వామి, నారాయణ, సుధాకర్, మారుతి, రామాంజి తదితరులు పాల్గొన్నారు.



గృహ ప్రవేశంలో పాల్గొన్న ఆలూరి సాంబశివారెడ్డి, పైలా నరసింహయ్య

రంగనాథుడి కల్యాణానికి లగ్నం ఖరారు

గుత్తి రూరల్: జక్కలచెరువు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి కల్యాణాన్ని ఈ నెల 30న నిర్వహించేందుకు లగ్నాన్ని ఖరారు చేశారు. ఆదివారం గ్రామంలోని రంగనాథస్వామి ఆలయంలో ఈఓ దేవదాసు, గ్రామపెద్దలు, ప్రజలతో ఆలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి కల్యాణం నిర్వహించే తేదీలపై చర్చించారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఏటా నిర్వహించే కల్యాణాన్ని ఈ నెల 30న ఉదయం 10 నుంచి 12 లోపు ముహూర్తం ఉండటంతో కల్యాణం జరిపించే విధంగా లగ్నపత్రిక రాశారు. లగ్నపత్రికను అర్చకులు సతీష్, రవికుమార్ జక్కలచెరువు గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు నవీన్‌కుమార్, లిఖిల్ వర్మ, చేతన్ వర్మ, ఉదయ్, గ్రామస్తులు రాజన్నయాదవ్, రంగస్వామి, గోపాల్, ఇబ్రహీం, వెంకటనారాయణ పాల్గొన్నారు.



గ్రామస్తులకు లగ్నపత్రికను అందిస్తున్న ఈఓ, అర్చకులు

భాగవత సప్తాహ పఠన, శ్రవణ యజ్ఞం

పుట్లూరు: మడ్డిపల్లి రామాలయంలో భాగవత సప్తాహ పఠన, శ్రవణ యజ్ఞం ఆదివారం కొనసాగింది. ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ గ్రామపెద్దల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భాగవత భక్త సమాజం మీడియా కోఆర్డినేటర్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. తాడిపత్రికి చెందిన జానకిరామ్ శర్మ ప్రవచనం చేపట్టారన్నారు.

జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌ల నియామకం

అనంతపురం క్రైం: తాడిపత్రి నియోజకవర్గంలోని పెద్దవడుగూరులో బట్టా వేణుగోపాల్, మేనుకింద రాజశేఖర్ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లుగా నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం

తాడిపత్రి : పట్టణంలోని శివసాయి వృద్ధాశ్రమంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. తేజశ్వి ఆసుపత్రి వైద్యులు మధుఅశోక్, డాక్టర్ సాయికిరణ్‌రెడ్డి, డాక్టర్ వసుంధర 105 మంది రోగులకు పరీక్షలు చేయడంతోపాటు మందులు అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, సభ్యులు నాగవాణి, అనురాధ, నాగేశ్వర రెడ్డి, హరిత, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీయడానికే పరీక్షలు

గుంతకల్లుటౌన్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని ఎంఈఓ సుబ్బరాయుడు తెలిపారు. జెడ్పీ మాజీ చైర్మన్ కేసీ నారాయణ జయంతి సందర్భంగా స్థానిక కేసీ. నారాయణ స్కూల్‌లో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో జూనియర్, సీనియర్ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 14 మందితో పాటు మరో 34 మంది విద్యార్థులకు మొత్తం రూ.1 లక్ష నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఆదివారం పాఠశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ సుబ్బరాయుడు, శ్రీశంకరానంద విద్యాసంస్థల కరస్పాండెంట్ కెసి.హరి బహుమతులను ప్రదానం చేశారు. శంకరానంద డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ గోపాల్, కేసి.మారుతిప్రసాద్, మాధవి, డాక్టర్ ఆమని, అధ్యాపకులు క్రిష్ణయ్య, డాక్టర్ గోపి, డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందిస్తున్న దృశ్యం